క్లుప్తంగా

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



పాలకొల్లు బస్టాండ్‌లో కళాజాత ప్రచారం

పాలకొల్లు సెంట్రల్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతపై శుక్రవారం స్థానిక బస్టాండ్‌లో ప్రజలకు కళాజాత కళాకారులు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పట్టణ ప్రాజెక్టు అధికారిణి ఎం ఉమ, ఏసీడీపీఓ నాగరత్నం, మల్లేశ్వరి, నాగ పద్మావతి, సుధ, మోహనరాణి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి శస్త్రచికిత్సలు



కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న వృద్ధులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ఓ ప్రైవేటు కంటి ఆసుపత్రిలో 10 మంది వృద్ధులకు కంటి శస్త్రచికిత్సలు చేయించినట్టు వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు తెలిపారు. రూ.45 వేల వ్యయంతో చికిత్స చేయించామన్నారు. పేదలను ఆదుకోవడానికి వాకర్స్ క్లబ్ ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. క్లబ్ సభ్యులు పోతుల ఉమాశంకరరావు, జవ్వాజి కళ్యాణ్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రంలో పోషక యాజమాన్యంపై శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ పి.ఉషారాణి

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్ఆర్ విశ్వ విద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రంలో ప్యాక్స్ వారి ఆర్థిక సాయంతో సమగ్ర పోషక యాజమాన్యంపై 15 రోజుల శిక్షణ కార్యక్రమం మూడోవ రోజుకు చేరింది. రాజమండ్రి వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ అండ్ హెడ్ డాక్టర్ పి.ఉషారాణి హాజరై శిక్షణ అందజేశారు. ఆమె మాట్లాడుతూ వివిధ పోషకాలు ఆవశ్యకత, మొక్కలు, వివిధ పంటలు, ప్రధాన ద్వితీయ, సూక్ష్మపోషకాలు, ఏఏ మోతాదులలో ఏ పంటలకు వాడాలి తదితర విషయాలను వెల్లడించారు. మోతాదులకు మించి ఎరువులను వాడితే నేల కలుషితం అవుతుందని చెప్పారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి.పెద్దబాబు మాట్లాడుతూ నేలల పరిరక్షణ, పర్యావరణం, జీవన వైవిధ్యం తదితర విషయాలపై చర్చించారు. ప్యాక్స్ సభ్యులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్లు దగ్ధం



దగ్ధమవుతున్న కేబుల్ వైర్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఏలూరు రోడ్డులోని సాయిబాబా టెంపుల్ దగ్గర కాలనీలో శుక్రవారం ఉదయం విద్యుత్ స్తంభానికి కట్టి ఉన్న కేబుల్ వైర్లకు మంటలు అంటుకున్నాయి. స్థానికుల సమాచారం మేరకు ఫైర్ ఆఫీసర్ మురళీ కొండబాబు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని సీఓ2 సహాయంతో మంటలను అదుపు చేశారు. స్థానికులు నుంచి వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని తెలిపారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం

కాళ్ల: స్థానిక వల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద కాళ్లకూరు గ్రామానికి చెందిన దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు రూ.లక్షతో భక్తులకు సౌకర్యార్థం షెడ్డు నిర్మించారు. ఆలయం 13వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామ పెద్దలు, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకట రత్న ప్రసాద్, దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల రామరాజు చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణం చేపట్టిన రామరాజును అభినందించి సత్కరించారు.

వేడుకల్లో భాగస్వాములు కావాలి

భీమవరం: స్థానిక వెంకటేశ్వర బధిరోన్నత పాఠశాల 40వ వార్షికోత్సవ వేడుకల్లో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. బధిరోన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, బధిర క్రీడాకారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న నిర్వహించే వార్షికోత్సవ వేడుకల బ్రోచర్‌ను శుక్రవారం ఆయన విడుదల చేశారు. వార్షికోత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, అధ్యక్షుడు సీహెచ్ తాతారావు మాట్లాడుతూ ఈ పాఠశాల వార్షికోత్సవాన్ని డీఎన్నార్ కళాశాల రామకృష్ణ సభ భవనంలో నిర్వహిస్తున్నామని, సుమారు 400 మంది పాల్గొంటున్నారని తెలిపారు.

అధ్వానంగా భట్లమగుటూరు కెనాల్ రోడ్డు



వెలగలవారిపాలెం నుంచి తాళ్లచెరువు వరకు చెరువులా మారిన రోడ్డు



తాళ్లచెరువు చర్చి నుంచి శ్రీరామపురం వరకు బురదమయంగా మారిన భట్లమగుటూరు కెనాల్ రోడ్డు

- జారిపడుతున్న వాహనచోదకులు
- తారురోడ్డు నిర్మించాలని డిమాండ్

పెనుమంట్ర: వెలగలవారిపాలెం గ్రామం నుంచి భట్లమగుటూరువరకు సుమారు 3 కిలో మీటర్ల పొడవు ఉన్న కెనాల్ రోడ్డు అధ్వానంగా మారింది. ఇది కనీస మరమ్మతులు కూడా నోచుకోకపోవడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వెలగలవారిపాలెం తాళ్లచెరువు గ్రామంలో కమ్యూనిటీ హాలు నుంచి చర్చి వరకు రూ.20 లక్షలతో సుమారు 500 మీటర్లు కెనాల్ రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మించారు. తాళ్లచెరువు నుంచి భట్లమగుటూరు వరకు రోడ్డు మరమ్మతులకు నోచుకోక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షం వస్తే పొలాలకు ఎరువులు తీసుకెళ్లాలన్నా, పొలాల నుంచి పచ్చగడ్డి, కొబ్బరికాయలు తీసుకురావాలన్నా రైతులు అనేక కష్టాలు పడుతున్నారు. తాళ్లచెరువు నుంచి వెలగలవారిపాలెం వరకు ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. దీంతో రాకపోకల సమయంలో వాహనచోదకులు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. వెలగలవారిపాలెం నుంచి తాళ్లచెరువు కమ్యూనిటీహాల్ వరకు, తాళ్లచెరువు చర్చి నుంచి శ్రీరామపురం వద్ద స్టేట్‌హైవే రోడ్డు వరకు రెండున్నర కిలో మీటర్లు మేర తారురోడ్డు నిర్మించాలని వెలగలవారిపాలెం, పెనుమంట్ర, బ్రాహ్మణచెర్వు, భట్లమగుటూరు గ్రామాలకు చెందిన సుమారు 3 వేల ఎకరాల ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

15 ఏళ్లుగా మరమ్మతుల్లేవు



వెలగలవారిపాలెం నుంచి తాళ్లచెరువు వెళ్లాలంటే నరకం చూడాల్సివస్తోంది. మోటారు సైకిళ్లు, బురదలో జారి అనేక మంది గాయాలు పాలవుతున్నారు. 15 ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డు నేటికి మరమ్మతులకు నోచుకోలేదు.

– రొక్కాల సతీష్, తాళ్లచెరువు

పట్టించుకునేవారేరి?



పొలాల నుంచి రైతులు పశుగ్రాసం, కొబ్బరి వంటి ఫలసాయాలు తీసుకురావాలంటే వర్షాకాలంలో చాలా ఇబ్బందికరంగా ఉంది. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదు.

– కత్తిమండ యేసేబు, కొబ్బరిదీత కార్మికుడు, తాళ్లచెరువు

తరచూ ప్రమాదాలు



పశువుల శాలలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంది. రోడ్డు సరిగా లేక పశుగ్రాసం, ఎరువులు, రవాణాకు రైతులు చాలాఇబ్బందులు పడాల్సివస్తోంది. ద్విచక్రవాహనాలు ఈ రోడ్డులో ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నాం.

– గోగాడ రామారావు, రైతు, వెలగలవారిపాలెం

ధనలక్ష్మీ నమోస్తుతే!



ధనలక్ష్మి అలంకరణలో యలమంచిలి శ్రీ పుంతల ముసలమ్మ

యలమంచిలి: స్థానిక కాపులపాలెం గ్రామ దేవత పుంతల ముసలమ్మవారు శ్రావణ శుక్రవారం సందర్భంగా ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు రూ.9.20 లక్షల నోట్లతో అమ్మవారితో పాటు ఆలయ ప్రాంగణాన్ని కూడా సర్వాంగ సుందరంగా అలంకరించారు. మహిళ భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం సామూహిక లలిత సహస్ర నామ పారాయణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

మున్సిపల్ ఇన్‌చార్జి మేనేజర్‌గా మురళీకృష్ణ

నరసాపురం: మున్సిపల్ ఇన్‌చార్జి మేనేజర్‌గా ప్రస్తుతం మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ గుణ్ణం మురళీకృష్ణ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన మేనేజర్‌గా అదనపు బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న మేనేజర్ గతనెలలో పదవీవిరమన ఏయడంతో పోస్టు ఖాళీ అయ్యింది.

సుందరీకరణపై మునిసిపాలిటీ నిర్లక్ష్యం



మట్టిదిబ్బలతో దర్శనమిస్తున్న లాకురోడ్డు

నరసాపురం: పట్టణ సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడబడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు, మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. లాకుల నుంచి కొండాలమ్మ గుడి వరకు గోదావరి గట్టు వెంబడి, మత్స్యపురి వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు పంట కాలువ వెంబడి ప్లాట్‌పామ్ రెయిలింగ్ పలు చోట్ల ధ్వంసమైంది. కొండాలమ్మ గుడి ప్రాంతంలో మార్బుల్స్ రెయిలింగ్ చోరుల పాలవుతోంది. గోదావరి బండ్‌కు వెళ్లే మార్గంలో నిర్మించిన రోడ్లు నిరుపయోగంగా మారాయి. రోడ్డు పక్కన మట్టిదిబ్బలు దర్శినమిస్తున్నాయి. రోడ్డు వెంబడి ప్రైవేటు వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. ఇప్పటికై నా మున్సిపల్ అధికారులు స్పందించి పరిస్థితిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

దర్భరేవు డ్రెయిన్‌ను పూర్తిస్థాయిలో తవ్వాలి



దర్భరేవు డ్రెయిన్ తవ్వకంపై మాట్లాడుతున్న నాయకులు

నరసాపురం రూరల్: దర్భరేవు – కొత్తకాయలతిప్ప డ్రెయిన్‌ను పూర్తిస్థాయిలో తవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల నాయకులు కటకంశెట్టి మాణిక్యాలరావు తదితరులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు రైతులతో కలిసి కాలువ పనులను పరిశీలించారు. దర్భరేవు డ్రెయిన్‌ను ఆధునికీకరించి 20 ఏళ్లయిందన్నారు. ఇటీవల ఈ డ్రెయిన్ ఆధునికీకరణకు సుమారు రూ.45 లక్షల వరకు నిధులు మంజూరు చేశారని, పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ కాలువకు ఇరువైపులా మట్టితీసి మధ్యలో ఉన్న పూడిక తీయకపోవడంతో నీరు పారే పరిస్థితి లేదని తెలిపారు. తక్షణమే కాలువ మధ్యలో ఉన్న మట్టి తవ్వించాలని కోరారు. పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి దర్భరేవు నుంచి కొత్తకాయల తిప్ప వరకు ఆధునికీకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు సంగాని వెంకటేశ్వరరావు, గుబ్బల శ్రీను, కటకంశెట్టి వెంకటేశ్వరరావు, జుత్తిగ హనుమంతరావు, కడలి తాతయ్య, పోతాబత్తుల నర్సింహారావు, కడలి తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: దోమ పుట్టుకను నివారించేందుకు ఖర్చురహితమైన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి ఇంటా పాటించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు జంగం చెర్వు ప్రాంతంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే, వెక్టార్ కంట్రోల్ హైజీన్, కీటకజనిత వ్యాధులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రతిరోజూ డ్రైడే పాటించాలని ఇందులో భాగంగా గృహాల్లో ఫ్రిజ్ వెనుక ఉన్న వేస్ట్ వాటర్ కంటైనర్ లోని నీటిని తీసి శుభ్రం చేసుకోవాలని సూచించారు. నీటిని నిల్వ ఉంచే డ్రమ్ములపైన మూతలు ఉంచడం, ఇంటిపైభాగంలో ఉండే ఓవర్ హెడ్ ట్యాంక్‌పై తప్పనిసరిగా మూత ఏర్పాటుచేయడం వంటి జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



సిద్ధాంతంలో బస్టాండ్ సెంటర్‌లో దుర్గమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



సిద్ధాంతంలో వశిష్ట గోదావరికి హారతిస్తున్న భక్తులు

పెనుగొండ: వరలక్ష్మీ వ్రతం పెనుగొండ, ఆచంట మండలాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పవిత్ర శ్రావణ మాసం రెండో శుక్రవారం ఉదయం నుంచి ఇళ్లల్లో వరలక్ష్మి మాతను ప్రతిష్ఠించి పూజలు చేశారు. మహిళలు షడ్రుచులతో పిండి పదార్థాలు తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పూజల అనంతరం ముత్తైదువులకు వాయినాలు అందించారు. సాయంత్రం అమ్మవారికి మరోసారి పూజలు చేసి, ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకొని పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయాలు అన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సిద్ధాంతం వద్ద వశిష్ట గోదావరికి హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పంచ హారతుల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మిన్నంటిన ధరలు

వరలక్ష్మీ వ్రతానికి ధరల మోత మోగింది. పువ్వులు, పండ్లు ధరలు ఆకాశాన్ని అంటాయి. ముఖ్యంగా పువ్వులు చామంతి కేజీ రూ.500లకు పైగా విక్రయించారు. పండ్లు డజను రూ.300 నుంచి రూ.400 అమ్మకాలు చేశారు. బంగారు రూపుల ధరలు అధికంగా ఉండడంతో కొనుగోళ్లు తగ్గాయి. కలువ, తామర పువ్వులు ఒక్కొక్కటీ రూ.20 వరకు అమ్మారు. దీంతో కొనుగోలు దారులు నోరెళ్లబెట్టాల్సి వచ్చింది.



గాజులతో అలంకరణలో మార్టేరు శ్రీపోలేరమ్మ



కరెన్సీ అలంకరణలో మార్టేరు మహాలక్ష్మి



పాలకొల్లు కనకదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం ఆచరించారు. పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీ పార్వతి అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక యడ్లబజారు సెంటర్‌లోని శ్రీ కనక దుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని పూలతో అలంకరించారు. భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. రాత్రి భక్తులతో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి.

విశేష అలంకరణలు

పెనుమంట్ర: శ్రావణ శుక్రవారం శ్రీ వరలక్ష్మి దేవి వ్రతం సందర్భంగా జుత్తిగ శ్రీ ఉమా సోమేశ్వరస్వామి నత్తా రామేశ్వరం శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి, మార్టేరు శ్రీ కనకదుర్గమ్మ, మల్లిపూడి శ్రీ వారాహి మాత ఆలయాల్లోని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మార్టేరు శ్రీ కనకదుర్గమ్మ ఆలయ కమిటీ చైర్మన్ తేతలి రాజారెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారిని బంగారు పూత గల వెండి చీరతో అలంకరించారు. గ్రామ దేవత పోలేరమ్మ వారిని గాజులతోనూ, రామాలయంలోని మహాలక్ష్మి అమ్మవారిని నగదు కట్టలతోనూ అలంకరించి, కమిటీ సభ్యులు వెలగల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు పూజలు చేశారు. మహిళలు తమ ఇళ్ల వద్ద శ్రీ వరలక్ష్మి వ్రతాలను ఆచరించారు.

తాడేపల్లిగూడెంలో అగ్ని ప్రమాదం

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని ఎస్వీఆర్ సర్కిల్ సమీపంలో పెయింటింగ్ వేస్తుండగా కార్మికులముందే ప్రమాదవశాత్తు ఐసర్ వ్యాన్‌కు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

15న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు

నరసాపురం: స్థానిక మదర్ థెరిస్సా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 15న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్టు ఆ సంఘ ప్రతినిధి రాబర్ట్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వలంధర్‌రేవులో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే పోటీల్లో అన్ని వయస్సులవారు పాల్గొనవచ్చిని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలుతోపాటు షీల్డ్ అందిస్తామని తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.200, పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 98480-26302లో సంప్రదించాలని పేర్కొన్నారు.

భారంగా డంపింగ్ యార్డులు



మార్టేరులోని డంపింగ్ యార్డు

పెనుగొండ: డంపింగ్ యార్డులు పంచాయతీలకు పెనుభారంగా మారుతున్నాయి. అరకొర స్థలాలు ఉండడంతో వాటిలోనే గ్రామాల్లోని చెత్తా చెదారాలు వేసి కొండల్లా తయారు చేస్తున్నారు. వర్షాకాలం వస్తే డంపింగ్ యార్డుల్లోకి వెళ్లే అవకాశాలు లేక రహదారి పక్కనే డంపింగ్ చేసి, వాటిని తగుల పెడుతూ రహదారిలో వెళ్లే వాహన చోదకులను ఇక్కట్లుకు గురిచేస్తున్నారు. ఆచంట నియోజకవర్గంలో ప్రధాన మేజరు గ్రామాలన్నింటిలోనూ డంపింగ్ యార్డుల సమస్యలతో గ్రామ పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. అదనపు స్థలాలు కేటాయించాలని దశాబ్దాలుగా ప్రభుత్వాలకు విజ్ఞప్తిచేస్తున్నా, అవి బుట్టదాఖలవుతునే ఉన్నాయి తప్ప ప్రయోజనం కనిపించడం లేదు. ఫలితంగా పంట, మురుగు కాలువలు పక్కనా, రహదారుల పక్కన ఖాళీ స్థలాలు, శ్మశానాలను డంపింగ్‌తో ముంచేత్తి ఆఖరి మజిలీని క్లిష్టతరం చేస్తున్నారు. పెనుగొండ పంచాయతీ ఏర్పడిన నాటి నుంచే వడలి రోడ్డులో శివారున నక్కలడ్రయిన్ గట్టును డంపింగ్ యార్డుగా ఉపయోగించుకొంటున్నారు. నానాటికి పెరిగిన జనాభా, ప్లాస్టిక్ వినియోగంతో గ్రామంలో చెత్త పెరిగిపోయింది. దీనిని డంపింగ్ యార్డుకు తరలిస్తూ నక్కల డ్రయిన్ గట్టునే వేస్తున్నారు. దీంతో నక్కల డ్రయిన్‌లోకి చెత్త జారిపోతూ మురుగునీరు ప్రవాహానికి అడ్డంకిగా మారుతుంది. డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలంటూ పంచాయతీ నుంచి రెవెన్యూకి దశాబ్దకాలం క్రితం వినతి పత్రం అందజేశారు. ఇటీవల మరోసారి విజ్ఞప్తిచేశారు. ఐనా ఫలితంలేకుండా పోయింది. వడలి పంచాయతీలోనూ ఇదే పరిస్థితి. శ్మశానం పక్క స్థలాన్ని డంపింగ్ యార్డుగా వినియోగించుకొంటున్నారు. చెత్త పెరగడంతో శ్మశానం చిన్నదవుతూ వస్తుంది. ఇక, సిద్ధాంతం కేదారీఘాట్‌లో శ్మశానవాటిక దుస్థితి మరీ దారుణం, శ్మశానంలోనే చెత్త వేస్తుండడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో చెత్తను గోదావరిలోకి గెంటడం, మరికొంత మరోచోటికి తరలించి తాత్కాలిక ఉపశమనం కల్పించారు. దీనికి పంచాయతీకి అదనపు ఆర్థిక భారం పడింది. మార్టేరు డంపింగ్ యార్డు కొండలా పేరుకు పోయింది. రోడ్డుపైకి వచ్చిన చెత్తను తగుల బెడుతూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఇదే పరిస్థితి మేజరు పంచాయతీల్లో నెలకొని ఉంది. అధికారులు ఇప్పటికై నా స్పందించి డంపింగ్‌యార్డుల సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



పెనుగొండలో నక్కల డ్రయిన్‌కు ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డు



సిద్ధాంతం శ్మశాన వాటికలో చెత్తా చెదారాలు తొలగిస్తున్న దృశ్యం